క్లుప్తంగా

నేటి నుంచి దూరవిద్య పరీక్షలు

పీలేరు రూరల్ : స్థానిక సంజయ్ గాంధీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం నుంచి శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం దూరవిద్య పరీక్షలు నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ సుధాకర్‌రెడ్డి తెలిపారు. పరీక్షా కేంద్రానికి ఎటువంటి ఎలక్ట్రానిక్ వస్తువులు, సెల‌ఫోన్లు అనుమతించబోమని తెలిపారు. పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులు దూరవిద్య కేంద్రం వారు జారీ చేసిన గుర్తింపు కార్డు, హాల్ టికెట్ తప్పనిసరిగా కలిగి ఉండాలన్నారు.

డీవైఈఓ మృతికి ఆర్‌జేడీ నివాళి

ములకలచెరువు: మండలంలోని దేవులచెరువుకు చెందిన డీవైఈఓ చంద్రశేఖర్ మృతికి విద్యాశాఖ ఆర్‌జేడీ శామ్యూల్ మంగళవారం నివాళులు అర్పించారు. శ్వాస సంబంధిత వ్యాధితో బాధపడుతూ ఆయన సోమవారం మృతిచెందారు. ఆయన స్వగ్రామం దేవులచెరువులో అంత్యక్రియలు నిర్వహించారు.

రేపు మండల మీట్

బి.కొత్తకోట: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం గురువారం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ దిలీప్‌కుమార్ మంగళవారం తెలిపారు. ఉదయం 11 గంటలకు ప్రారంభమయ్యే సమావేశానికి ఎన్నికైన ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు మాత్రమే హాజరవ్వాలని, సభ్యులు కాని వారు సమావేశం హాలులోకి హాజరుకారాదని పేర్కొన్నారు. మండల అభివృద్ధి, ప్రభుత్వ కార్యకలాపాలపై చర్చించనున్నట్లు పేర్కొన్నారు.

అమ్మవారి లడ్డూ వేలం



వేలంలో దక్కించుకున్న లడ్డూతో చంద్రశేఖర్

మదనపల్లె సిటీ: శ్రీ చౌడేశ్వరిదేవి జ్యోతి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం స్థానిక నీరుగట్టువారిపల్లెలోని చౌడేశ్వరి ఆలయంలో అమ్మవారి లడ్డూ వేలం నిర్వహించారు. లడ్డూ వేలంలో పలువురు పోటీలు పడ్డారు. ఆలయ కమిటీ చైర్మన్ పురాణం చంద్రశేఖర్ రూ.27,500 లకు దక్కించుకున్నారు. అలాగే అమ్మవారి వచ్చిన చీరలు, జ్యోతి నాణెములు వేలం వేశారు. భక్తులకు జ్యోతి ప్రసాదాలు అందజేశారు. అమ్మవారికి ప్రత్యేకంగా అలంకరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు పురాణం చంద్రశేఖర్, కార్యదర్శి పవన్‌కుమార్, కోశాధికారి రత్నమయ్య, ఉప్పు రామచంద్ర, నాగరాజ, నీలకంఠ, సిద్దప్ప,మోహన తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత స్థాయిలో ఆదర్శంగా నిలవాలి



తేజస్విని తల్లిదండ్రులతో ఎమ్మెల్యే ద్వారకకాథరెడ్డి

తంబళ్లపల్లె: మండలంలోని కన్నెమడుగు రఘురామిరెడ్డి, నాగవేణి దంపతుల కుమార్తె కె.తేజస్విని సీఏఎలో ఆలిండియా ఫస్ట్‌ర్యాంకు, సీఏ ఫైనల్‌లో ఆలిండియా 14వ ర్యాంకు సాధించింది. మంగళవారం ఆ బాలికలను వారి స్వగృహంలో ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి శాలువ కప్పి సన్మానించారు. భవిష్యత్తులో మంచి స్థాయిలో నిలిచి అందరికి ఆదర్శంగా నిలవాలన్నారు. క్రమశిక్షణ, పట్టుదలతో చదివి నియోజకవర్గానికి వన్నెతేవడం గర్వంగా ఉందన్నారు. తేజస్విని తల్లిదండ్రులు శాలువ కప్పి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచు శివమ్మ, ఎంపిటీసీ సభ్యులు మహేష్, నాయకులు చినబాబు, మల్లికార్జున రెడ్డి, శివారెడ్డి, వెంకటరమణ, పూజారి శంకరరెడ్డి, ఎరుకల్‌రెడ్డి, రామశంకరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఏఎస్ఐకి సన్మానం



ఏఎస్ఐ చంద్రయ్య దంపతులను సన్మానిస్తున్న ఎస్పీ విద్యాసాగర్ నాయుడు

రాయచోటి టౌన్ : అన్నమయ్య జిల్లా మదనపల్లె-2 పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వర్తిస్తూ మంగళవారం పదవీ విరమణ పొందిన ఏఎస్ఐ పి.చంద్రయ్యను జిల్లా ఎస్పీ విద్యాసాగర్ రావు సన్మానించారు. చంద్రయ్య పోలీస్ శాఖలో ఎంతో సేవ చేశాని చెప్పారు. తన 38 సంవత్సరాల కాలంలో చాలా క్రమశిక్షణతో వృత్తి ధర్మాన్ని నిర్వర్తించారని కొనియాడారు. ఆయన శేష జీవితం ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో ప్రశాంతంగా ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ (అడ్మిన్) ఎం.వెంకటాద్రి, ఏఓ బి.కృష్ణుడు, ఆర్ఐలు విజె రామకృష్ణ, ఎం.పెద్దయ్య, మదనపల్లె ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ మోహన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రామదర్శనం..ముక్తి దాయకం

- రేపటి నుంచి శ్రీ పట్టాభిరాముడి బ్రహ్మోత్సవాలు ప్రారంభం
- అంకురార్పణకు సర్వం సిద్ధం
- టీటీడీ ఆధ్వర్యంలో భారీ ఏర్పాట్లు



వాల్మీకిపురంలోని పట్టాభిరామాలయం



ప్రత్యేకాలంకరణలో పట్టాభిరామ సమేత సీతమ్మ, లక్ష్మయ్య

కలికిరి(వాల్మీకిపురం): వాల్మీకిపురంలో వెలసిన పట్టాభిరామ స్వామిని దర్శించుకుంటే మోక్షం లభిస్తుందని భక్తుల విశ్వాసం. వాల్మీకి మహర్షి ఈ ప్రాంతంలో తపస్సు చేయడంతోనే ఈ గ్రామానికి వాల్మీకిపురం అన్న పేరు వచ్చిందని, శ్రీరామచంద్రుడు వాల్మీకం (పుట్ట)లో వెలిసినందున వాల్మీకిపురం అయిందన్న అభిప్రాయాలున్నాయి. ఈ నేపథ్యంలో ఇక్కడ వెలసిన పట్టాభిరాముడికి ఏటా నిర్వహించే బ్రహ్మోత్సవాలు ఈ ఏడాది గురువారం నుంచి ప్రారంభం కానున్నాయి.

ఆలయ ప్రాశస్త్యమిదీ ..

చిత్తూరు జిల్లా, వాల్మీకిపురంలో వెలసిన శ్రీ పట్టాభిరామస్వామి దేవాలయం 1000 సంవత్సరాల క్రితం నిర్మించినట్లు, 13వ శతాబ్దంలోనే ఈ పట్టాభిరామస్వామి దేవాలయాన్ని పునఃనిర్మాణము గావించినట్లు రికార్డులు తెలుపుచున్నాయి. 15వ శతాబ్దంలో తొలి తెలుగు వాగ్గేయకారుడు పద కవితా పితామహులు శ్రీ తాళ్ళపాక అన్నమాచార్యుల వారు వాల్మీకిపురం క్షేత్రాన్ని సందర్శించి ఎన్నో కీర్తనలను రచించినారు. ఈ పట్టాభిరామాలయంలో గల మూల విగ్రహాలను మహర్షి జాంబవంతులు వారిచే ఒకేచోట ప్రతిష్ఠించడమైనది. వాల్మీకిపురం పరిసర ప్రాంతంలోని శతశృంగపర్వతాలలో వాల్మీకి మహర్షి తపస్సు చేసినారని, ఈ కారణంగా వాల్మీకిపురం క్షేత్రం పురాణ ప్రసిద్ధిగాంచినది. మరియు భారతదేశంలో అయోధ్య తర్వాత శ్రీరామ క్షేత్రాలలో మొదటిస్థానం వాల్మీకిపురమే. ఎంతో ఘనమైన చరిత్ర కల్గిన ఈ ఆలయానికి ఆనాటి రాజులు శ్రీకృష్ణదేవరాయులు, ఛత్రపతి శివాజి, అతని తల్లి జిజియాబాయి, సాళువ నరశింగభూపతిరాయలవారు మరియు ఆంగ్లేయుల అధిపతులలో థామస్ మన్రో, సి.పి బ్రౌన్, హార్డ్‌హార్డింగ్ వంటి వారు, ముస్లిం నవాబులు శ్రీరాముని సేవించి తరించినారు. ఇంతటి చరిత్ర కల్గి పురాణ ప్రసిద్ధిగాంచిన ఈ పట్టాభిరామస్వామి ఆలయాన్ని 1997 సంవత్సరంలో తిరుమల-తిరుపతి దేవస్థానమునకు అనుబంధ దేవాలయంగా చేర్చడమైనది. ఆనాటి నుంచి నేటి వరకు తిరుమల-తిరుపతి దేవస్థానము వారు ఎంతో వైభవంగా ప్రతియేటా శ్రీపట్టాభిరామ స్వామివారి బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నారు.

సర్కారు హారతి కోసం విన్నపాలు

రాష్ట్ర విభజన అనంతరం శ్రీరామనవమి రోజున కడప జిల్లా, ఒంటిమిట్ట రామాలయంలో ప్రభుత్వ లాంచనాలతో గౌరవ ముఖ్యమంత్రివర్యులు పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పిస్తున్నారు. అలాగే విజయనగరం జిల్లా, రామతీర్థం రామాలయంలో శ్రీరామ నవమిని ప్రభుత్వ లాంచనాలతో రాష్ట్రమంత్రివర్యులు పట్టువస్త్రాలు, తలంబ్రాలు సమర్పిస్తున్నారు. చారిత్రక నేపథ్యం ఉన్న చిత్తూరు జిల్లా, వాల్మీకిపురంలో వెలసిన శ్రీ పట్టాభిరామ స్వామికి ప్రతి యేటా తిరుమల-తిరుపతి దేవస్థానము వారు నిర్వహించే సాలకట్ల వార్షిక బ్రహ్మోత్సవాలల్లో భాగంగా కళ్యాణోత్సవం రోజున రాష్ట్రమంత్రివర్యులుచే ప్రభుత్వ లాంచనాలతో పట్టువస్త్రాలు, తలంబ్రాలు సమర్పించాలని వాల్మీకిపురం ప్రజలు అనేకమార్లు టీడీపీ అధికారులకు, ప్రభుత్వానికి విన్నపాలు సమర్పించిన ఫలితం లేకుండా పోతుందని వాల్మీకిపురం వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

బ్రహ్మోత్సవాల వివరాలిలా..

బుధవారము బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ, గురువారం ధ్వజారోహణము, రాత్రి - గజ వాహన సేవ, శుక్రవారము ఉదయం - ముత్యపు పందిరి వాహనము, రాత్రి - హనుమంత వాహన సేవ, శనివారము ఉదయం - కల్పవృక్ష వాహనం, రాత్రి - సింహా వాహనంపై ఊరేగింపు, ఆదివారము ఉదయం - సర్వభూపాల వాహనం, రాత్రి - పెద్ద శేష వాహనంపై స్వామి వారి ఊరేగింపు నిర్వహిస్తారు. సోమవారం(7వ తేదీ) ఉదయం - సూర్యప్రభ వాహనం, రాత్రి - చంద్ర పభ వాహనం, మోహినీ అవతారము, మంగళవారం ఉదయం - తిరుచ్చి ఉత్సవము , రాత్రి - శ్రీ సీతారాముల కళ్యాణోత్సవం, గరుడ సేవ, బుధవారము ఉదయం - రథోత్సవం, సాయంత్రం - ధూళి ఉత్సవం నిర్వహిస్తారు. గురువారం ఉదయం - తిరుచ్చి ఉత్సవము , రాత్రి - పార్వేట ఉత్సవం, అశ్వవాహనం, శుక్రవారం ఉదయం - వసంతోత్సవము, చక్రస్నానం, రాత్రి - హంస వాహనం, ధ్వజావరోహణంతో ఉత్సవాలు ముగుస్తాయి.

4 నుంచి శ్రీరామనవమి ఉత్సవాలు

మదనపల్లె సిటీ: శ్రీరామనవమి బ్రహోత్సవాల్లో భాగంగా స్థానిక సొసైటీకాలనీలోని రామాలయంలో ఈనెల 4వతేదీ నుంచి ఉత్సవాలు ప్రారంభం కానున్నట్లు నిర్వాహకులు తెలిపారు. 4వతేదీ సాయంత్రం విష్వక్సేన ఆరాధన, పుణ్యాహవాచనం, రక్షాబంధనం, అంకుర్పారణ జరుగుతుందన్నారు. 5వతేదీన ఉదయం ధ్వజారోహణం, సాయంత్రం హనుమంత వాహన ఊరేగింపు, 6వతేదీన శ్రీరామనవమి పండుగ సందర్భంగా స్వామిని ప్రత్యేక అలంకరణ, ఉత్సవ విగ్రహాలకు పూజలు నిర్వహిస్తారన్నారు. 7వతేదీన స్వామి కళ్యాణోత్సవం, సాయంత్రం గరుడవాహనంపై ఊరేగింపు, 8వతేదీన రామతారక హోమం, సాయంత్రం బ్రహ్మ రథోత్సవం, 9వతేదీన ఉదయం హోమాలు, పూర్ణాహుతి, సాయంత్రం చక్రస్నానం, ధ్వజ అవరోహణం, స్నపన తిరుమంజనం చేపట్టనున్నట్లు తెలిపారు. భక్తులు ఉత్సవాలను తిలకించి తీర్థప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

కారు ఢీకొని వ్యక్తికి తీవ్రగాయాలు

నిమ్మనపల్లె : కారు ఢీకొని వ్యక్తి తీవ్రంగా గాయపడిన సంఘటన మంగళవారం మండలంలో జరిగింది. వాల్మీకిపురంకు చెందిన సాయికృష్ణ, చౌడేపల్లె నుంచి మారుతీకారులో వాయల్పాడుకు వస్తున్నాడు...నిమ్మనపల్లె పెద్దమాదిగపల్లెకు చెందిన గణేష్ ద్విచక్రవాహనంలో మదనపల్లెకు వెళుతుండగా మార్గమధ్యంలోని పిట్టావాండ్లపల్లె వద్ద ద్విచక్రవాహనాన్ని కారు ఢీకొంది. ప్రమాదంలో గణేష్ తీవ్రంగా గాయపడ్డాడు. గమనించిన స్థానికులు 108 వాహనంలో మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. నిమ్మనపల్లె పోలీసులు కేసు విచారణ చేస్తున్నారు.

భవిష్యత్తు వైఎస్సార్‌సీపీదే

- నిరుత్సాహపడకండి..ఎలాంటి సమస్య వచ్చినా అండగా నిలుస్తా
- ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి



స్థానిక నాయకులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి

తంబళ్లపల్లె: రాబోయే రోజుల్లో భవిష్యత్తు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీదే. ఎవరు నిరుత్సాహపడకండి.. ఎవరికి ఎలాంటి సమస్య వచ్చినా అందుబాటులో ఉంటూ అండగా నిలుస్తానని తంబళ్లపల్లె ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి భరోసా ఇచ్చారు. మంగళవారం కన్నెమడుగు రఘురామిరెడ్డి స్వగ్రామంలో జరిగిన ప్రత్యేక కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలతో రాజకీయ పరిస్థితులపై చర్చించారు. సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వైఎస్సార్‌సీపీ కార్యకర్తలకు ఎవరికి ఎలాంటి సమస్య వచ్చినా తాను పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. కూటమి ప్రభుత్వ అబద్ధపు ప్రచారాలను తిప్పికొట్టేవిధంగా ప్రజలను చైతన్యపరచాలన్నారు. ఆయన వెంట సర్పంచు శివమ్మ, ఎంపిటీసీ సభ్యులు మహేష్, మండల పార్టీ కన్వీనర్ చౌడేశ్వర్, నాయకులు రవిశంకర్‌రెడ్డి, కెఆర్ మల్‌రెడ్డి, నల్లగుండ్ల మల్లికార్జునరెడ్డి, రామశంకరరెడ్డి, ఎరుకల్‌రెడ్డి, సురేంద్రనాథ్ తదితరులు ఉన్నారు.

పెరిగిన మున్సిపల్ ఆస్తి పన్ను వసూళ్లు

- అన్ని పన్నులు కలిపి రూ.17.11 కోట్లు వసూలు
- ప్రైవేట్ ప్రాపర్టీస్‌లో 80 శాతానికి పైగా వసూళ్లు
- కమిషనర్ కె.ప్రమీల



మదనపల్లె : ఆస్తి పన్ను వసూళ్లలో మున్సిపల్ శాఖ 2024-25 ఆర్థిక సంవత్సరంలో ప్రగతి సాధించిందని, గత ఏడాదికంటే ఈసారి అదనంగా పన్ను వసూళ్లు సాధించామని మున్సిపల్ కమిషనర్ కే.ప్రమీల తెలిపారు. మంగళవారం ఆమె మీడియాతో మాట్లాడుతూ..పట్టణంలోని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ, ప్రైవేట్ ప్రాపర్టీస్ అన్నింటినీ కలుపుకుని మొత్తం పన్నుల డిమాండ్ రూ.23కోట్ల36లక్షలు కాగా, అందులో 17కోట్ల11లక్షలు(73.34శాతం) వసూళ్లు జరిగాయన్నారు. గత ఆర్థిక సంవత్సరంలో ఎన్నికల కారణంగా పన్ను వసూళ్లలో ఆశించిన స్థాయిలో ప్రగతి సాధించకపోయినా, ఈ ఏడాది మున్సిపల్, సచివాలయ సిబ్బంది సహకారంతో పన్ను వసూళ్లలో ప్రగతిని సాధించామన్నారు. ప్రైవేట్ ఆస్తుల విషయానికి వస్తే పట్టణంలోని 28,068 అసెస్‌మెంట్ల నుంచి రూ.18కోట్ల80లక్షలు డిమాండ్ కాగా, రూ.16.02 కోట్లు(80శాతం) వసూళ్లు చేశామన్నారు. గత ఏడాది రూ.16.5 కోట్లు డిమాండ్‌కు రూ.12.01 కోట్లు వసూలు జరిగిందన్నారు. మార్చి 31లోగా పన్ను చెల్లించేవారికి 50 శాతం వడ్డీ రాయితీ ప్రకటించడంతో ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చిన 5 రోజుల్లో రూ.1.9 కోట్లు వసూలు చేశామన్నారు. సెలవు, పండుగ రోజుల్లోనూ మున్సిపాలిటీలో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటుచేసి, సిబ్బందిని అందుబాటులో ఉంచడంతో చివరిరోజుల్లో ఆస్తి పన్ను చెల్లింపులు అనూహ్యంగా పెరిగాయన్నారు. కాగా, గత ఏడాదితో పోలిస్తే ఈసారి బకాయి చెల్లింపులు కూడా పెరిగాయని, ప్రైవేటు ఆస్తుల యజమానులతో పాటు ప్రభుత్వ సంస్థలు కూడా బకాయిల చెల్లింపునకు ముందుకు రావడం విశేషమన్నారు.

రంజాన్ సంప్రదాయాలతో జీవితం పునీతం

– మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి



మాజీ ఎమ్మెల్యే చింతలను సన్మానిస్తున్న నేతలు

కలికిరి(వాల్మీకిపురం): పవిత్ర రంజాన్ మాసం సంప్రదాయాలతో జీవితం పునీతమవుతుందని పీలేరు మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. మంగళవారం వాల్మీకిపురంలో మైనార్టీ నేతలు మాజీ ఎమ్మెల్యేని కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆకలి, దప్పులతో ఆచరించే కఠోర ఉపవాస దీక్షలు పేదల ఆకలి బాధలను తెలియజేస్తాయన్నారు. జకాత్, ఫిత్రా దానాలు పేదలలో వెలుగులను, పండుగ ఆనందాన్ని నింపుతయన్నారు. సద్భావన, శాంతి, ఐక్యతను రంజాన్ పండుగ బోధిస్తుందన్నారు. కార్యక్రమంలో వాల్మీకిపురం ఉప సర్పంచ్ బిడ్డల కేశవరెడ్డి, మైనార్టీ నాయులు అబ్దుల్ కలీమ్, పీలేరు అబీద్, షమి, షబ్బీర్, ఇంతియాజ్, జబీవుల్లా తదితరులు పాల్గొన్నారు.

కేజీబీవీ పాఠశాల తనిఖీ



విద్యార్థులతో మాట్లాడుతున్న ఏజీసీడీఓ శిరీష

నిమ్మనపల్లె : మండలంలోని ముష్టూరు కస్తూర్బా పాఠశాలను మంగళవారం జిల్లా బాలికల అభివృద్ధి అధికారి(జీసీడీఓ) మధుమతి, అసిస్టెంట్ జీసీడీఓ శిరీష ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలోని రికార్డులు, విద్యార్థుల హాజరు, రిజిస్టర్‌లను పరిశీలించారు. పాఠశాల పరిశుభ్రత, విద్యార్థుల గ్రేడింగ్, తరగతుల నిర్వహణపై పాఠశాల ప్రత్యేకాధికారి మునివెంకటమ్మను అడిగి తెలుసుకున్నారు. పాఠశాల నిర్వహణ, వసతులు, సమస్యలపై విద్యార్థులను విచారించారు. అనంతరం విద్యార్థులకు అందించే మధ్యాహ్నభోజనం తనిఖీ చేశారు. తనిఖీపై సంతృప్తి వ్యక్తం చేశారు. 9వతరగతి విద్యార్థులకు ముందుచూపు కార్యక్రమంలో భాగంగా మార్చి 10 నుంచి పదో తరగతి పాఠ్యాంశాలను బోధిస్తున్నట్లు ఎస్ఓ వారికి వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

శ్రీచౌడేశ్వరిదేవికిప్రత్యేక పూజలు



కోన గ్రామంలో చౌడేశ్వరిదేవి ఊరేగింపు

కలకడ : మండలంలోని కోన గ్రామంలో వెలసిన గ్రామదేవత శ్రీచౌడేశ్వరి దేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సోమవారం రాత్రి గ్రామ పురవీధులలో చాందినీబండిపై అమ్మవారు ఇంటింట పూజలు అందుకున్నారు. అమ్మవారికి దొగటవీరక్షత్రియుల ఆధ్వర్యంలో ఏటాబోనం సమర్పించారు. జ్యోతుల ముందు కోలాటం, చెక్కభజన, కళాకారుల వేషధారణలు భక్తులను ఎంతో ఆకట్టుకున్నాయి. అమ్మవారి ప్రత్యేక పూజల్లో స్థానికులతో పాటు కర్ణాటక, చెన్నై, హైదరాబాద్ నుంచి పలువురు భక్తులు తరలివచ్చి పాల్గొన్నారు. మంగళవారం ఉదయం 10గంటల వరకు ఇంటింట పూజలు అందుకున్న అమ్మవారు అనంతరం ఆలయ ప్రవేశం చేశారు. ఊరేగింపులో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సీఐ. గురునాథ, ఎస్ఐ రామాంజనేయులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఆప్కాస్‌ను రద్దు చేస్తే ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి

- కాంట్రాక్టు, ఏజెన్సీ విధానం వద్దు
- సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా



మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్న సీఐటీయూ నాయకులు

మదనపల్లె : మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులను పర్యవేక్షిస్తున్న ఆప్కాస్‌ను రద్దు చేస్తే తక్షణమే వారిని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు పి.శ్రీనివాసులు డిమాండ్ చేశారు. మంగళవారం మున్సిపల్ కార్యాలయం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ సభ్యులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పి.శ్రీనివాసులు మాట్లాడుతూ... గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఎన్నికల హామీల్లో భాగంగా తాము అధికారంలోకి వస్తే కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ విధానానికి స్వస్తి చెప్పి ప్రతి ఒక్కరిని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తిస్తామని చెప్పిందన్నారు. అధికారంలోకి వచ్చిన తర్వాత, కాంట్రాక్ట్, ఏజెన్సీలను రద్దుచేసి అప్కాస్ అనే సంస్థను ఏర్పాటు చేసి కార్మికులకు నేరుగా ప్రభుత్వమే జీతాలు చెల్లించే పద్ధతి తీసుకొచ్చిందన్నారు. దీనివల్ల కార్మికులకు కొంత మేలు జరిగిందన్నారు. అయితే ప్రస్తుతం గద్దెనెక్కిన కూటమి ప్రభుత్వం అప్కాస్‌ను రద్దు చేసి తిరిగి కాంట్రాక్టర్లకు దోచిపెట్టేందుకు ఏజెన్సీ విధానాలను తీసుకొస్తామని ప్రకటనలు చేయడం సబబు కాదన్నారు. కూటమి ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే వెంటనే ఆప్కాస్‌ను రద్దుచేసి కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలన్నారు. లేని పక్షంలో అంతవరకు ఆప్కాస్ విధానాన్నే కొనసాగించాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్టు విధానం వల్ల కార్మికులకు ఉద్యోగ భద్రత లేకుండా పోవడంతో పాటు పట్టణ ప్రజలపై భారం పడుతుందన్నారు. పారిశుధ్య పనులు జరగాలన్నా, పట్టణం పరిశుభ్రంగా ఉండాలన్నా, మంచి నీటి సరఫరా కావాలన్నా ప్రజలపై అదనపు చార్జీలు విధించడం జరుగుతుందన్నారు. దీనివల్ల డబ్బు చెల్లిస్తేనే పట్టణం పరిశుభ్రంగా మారే పరిస్థితి తలెత్తుతుందన్నారు. పట్టణ ప్రజలు సైతం పారిశుద్ధ కార్మికులకు అండగా నిలవాలని పిలుపునిచ్చారు. దినసరి వేతన కార్మికులకు మూడు నెలలుగా వేతనాలు చెల్లించకపోవడంతో వారి పరిస్థితి దయనీయంగా మారిందని, వెంటనే వారి బకాయిలు చెల్లించి ఆదుకోవాలని తెలిపారు. కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించే వరకు ఆప్కాస్ విధానాన్నే కొనసాగించాలని డిమాండ్ చేశారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ ప్రమీల ను కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ అధ్యక్షుడు చలపతి నాయుడు, ప్రధాన కార్యదర్శి సాంబశివ నాయక్, కోశాధికారి రామకృష్ణ, ఉపాధ్యక్షులు రాజు, గోపాల్, చిన్న రెడ్డప్ప, నరసింహులు, బాలకృష్ణ, సహాయ కార్యదర్శులు శ్రీరాములు, మునిస్వామి నాయక్, అరవింద్, చంద్ర, సభ్యులు కృష్ణప్ప, చంద్ర, శంకర్ నాయక్, తులసమ్మ, వెంకట్రమణ, రాధమ్మ పాల్గొన్నారు.

చిట్టిబోయనపల్లె కొండలకు నిప్పు



మంటలు పొలాలవైపు రాకుండా ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది, రైతులు

గుర్రంకొండ: గుర్రంకొండ సమీపంలోని చిట్టిబోయనపల్లె కొండలు కాలిబూడిదయ్యాయి. వాల్మీకిపురం నుంచి అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకొని మంటలను అదుపు చేశారు. సోమవారం రాత్రి గుర్తుతెలియని దుండగులు కొండలకు నిప్పు పెట్టారు. మంటలు దానవాలంలా వ్యాపించడంతో కొండలు, గుట్టలు కాల్చి బూడిదయ్యాయి. మంగళవారం కొండలకు దిగువభాగన ఉన్న శ్రీసాయిబాబా గుడి పరిసరాల్లోని గుట్టలు వాటి పరిసరాల్లో ఉన్న మామిడి తోటలను మంటలు చుట్టుముట్టాయి. పలుచోట్ల మామిడి చెట్లు కాలిబూడిదయ్యాయి. పొలాల్లో ఏర్పాటు చేసిన డ్రిప్ పరికరాలు, పైపులు కాలిపోయాయి. విషయం తెలుసుకొన్న వాల్మీకిపురంకు చెందిన అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన గుర్రంకొండకు చేరుకొన్నారు. కాలిపోతున్న గుట్టల వద్దకు చేరుకొని మంటలు పొలాలు, మామిడితోటల వైపు రాకుండా వాటిని అదుపు చేసి ఆర్పివేశారు. వారితో పాటు రైతులు కొమ్మలు, నీటితో మంటలు ఆర్పివేసేందకు విశ్వప్రయత్నం చేశారు. అయితే అప్పటికే వందలాది ఎకరాల్లో కొండలు, గుట్టలు కాలిబూడిదయ్యాయి. గత పదిరోజులు గుర్రంకొండ పట్టణ పరిసరాల్లో వేలాది ఎకరాలకు మంటలు వ్యాపించి కొండలు, గుట్టలు కాలిబూడిద కావడం గమనార్హం.

పశువుల దాహార్తి తీర్చడానికి నీటి తొట్టెలు



భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

కేవీపల్లె : వేసవిలో పశువుల దాహార్తి తీర్చడం లక్ష్యంగా జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో నీటి తొట్టిలు నిర్మిస్తున్నట్లు పీడీ వెంకటరత్నం అన్నారు. మంగళవారం మండలంలోని మహల్‌రాజుపల్లెలో పశువుల నీటి తొట్టెల నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ మండలానికి మొత్తం 38 నీటి తొట్టెలు మంజూరైనట్లు తెలిపారు. ఒక్కో తొట్టెను రూ. 33,200తో నిర్మిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సుధాకర్, ఏపీవో నాగరాజ, ఈసీ వెంకటేశులు తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి తొట్టెల నిర్మాణానికి భూమి పూజ

పీలేరు : ఉపాధి హామీ పథకంలో పశువుల తాగునీటి తొట్టెల నిర్మాణ పనులు ప్రారంభించారు. మంగళవారం మండలంలోని ముడుపుల వేములలో పీడీ వెంకటరత్నం నిర్మాణ పనులకు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీలేరు మండలానికి 27 నీటి తొట్టెలు మంజూరయ్యాయని తెలిపారు. వేసవిలో పశువుల దాహార్తి తీర్చడానికి నీటి తొట్టెలు నిర్మిస్తున్నట్లు చెప్పారు. పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీవో శివశంకర్, ఏపీవో అశోక్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నిమ్మనపల్లెలో..

నిమ్మనపల్లె : వేసవిలో పశువులు నీటికి ఇబ్బంది పడకుండా ఉండేందుకు ఉపాధిహామీ పథకంలో భాగంగా గ్రామాల్లో నిర్మిస్తున్న నీటితొట్టెల నిర్మాణాలకు మంగళవారం ఎమ్మెల్యే షాజహాన్‌బాషా భూమిపూజ చేశారు. మండలంలోని రాచవేటివారిపల్లె పంచాయతీ ఎగువమాచిరెడ్డిగారిపల్లెలో ఉపాధిహామీ అధికారులు, నాయకులతో కలిసి నిర్మాణపనులు ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ పరమేశ్వరరెడ్డి, ఏపీఓ రమేష్, ఏపీఎం మురళీ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మిథున్, టీడీపీ నాయకులు రాజన్న, శ్రీపతి, పుర్రా వెంకటరమణ, మహమ్మద్‌రఫీ, సుధాకరరావు తదితరులు పాల్గొన్నారు.

పాడిరైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

మదనపల్లె : పాడిరైతుల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోందని, అందులో భాగంగా వేసవిలో పశువులకు నీటి సమస్య తలెత్తకుండా గ్రామాల్లో నీటితొట్లను నిర్మిస్తోందని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా తెలిపారు. మంగళవారం మండలంలోని రామాచార్లపల్లెలో ఉపాధిహామీ పథకం కింద నిర్మిస్తున్న నీటితొట్ల నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... వేసవిలో చెరువులు, కుంటల్లో నీరు అడుగంటడంతో నీటి సమస్య తలెత్తుతోందన్నారు. పశువుల దాహార్తిని తీర్చేందుకు ఉపాధిహామీ పథకం కింద గ్రామాల్లో పశువుల తొట్ల నిర్మాణాలకు ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. మదనపల్లె మండలానికి 39 పశువుల తాగునీటి తొట్టెలు మంజూరయ్యాయన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ తాజ్‌మస్రూర్, ఏపీడీ నందకుమార్‌రెడ్డి, ఏపీఓ చెన్నకేశవులు, ఉపాధిహామీ, వెలుగు సిబ్బంది, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

బెట్టింగ్‌లకు దూరంగా ఉండాలి



పోస్టర్లు విడుదల చేసిన ఎస్ఎస్‌యూఐ నాయికులు

పీలేరు : బెట్టింగ్‌లకు విద్యార్థులు, యువత, ప్రజలు దూరంగా ఉండాలని ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు మద్దెల అమృత తేజ అన్నారు. మంగళవారం ఎన్ఎస్‌యూఐ ఆధ్వర్యంలో బెట్టింగ్‌లకు దూరంగా ఉండాలని అవగాహన పోస్టర్లు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బెట్టింగ్ యాప్ నిర్వాహకులు మొదట లాభాలు చూపించి అనంతరం సర్వం దోచేస్తారన్నారు. సరదాల కోసం బెట్టింగ్‌జోలికి వెళ్లరాదనారు. ఎన్ఎస్‌యూఐ రాజంపేట పార్లమెంట్ అధ్యక్షులు సాయిసంపత్‌కుమార్, అఖిల్, దినేష్, లోకేష్, సాజిద్ పాల్గొన్నారు.